# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



గురువారం 13 ఫిబ్రవరి 2025


## 2 వ విడత భూ రీ సర్వేను పరిశీలన

**సుండుపల్లె, ఫిబ్రవరి12, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలోని కందనవాండ్లపల్లెలో జరుగుతున్న రీ సర్వేను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తహసీల్దార్ దైవాధీనంతో పాటు రెవిన్యూ అధికారులు, మండల గ్రామ సర్వేయర్లు కలిసి సర్వే నెంబర్ 168 ని పరిశీలించారు సదరు భూములు రీ సర్వే జరుగుతుండడంతో అదే గ్రామానికి చెందిన రైతులు కందుల వెంకటరమణ, షేక్ షంషీర్ భాష,కంచన సభాపతి రైతులతో మాట్లాడి ఈ భూమిలో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించారు. గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని సంబంధిత గ్రామ రెవిన్యూ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మహా హారతి కార్యక్రమంలో మాతృమూర్తులు



**మైదుకూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

మహా హారతి కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న మాతృమూర్తులు.కార్యక్రమంలో స్వామీజీల మార్గదర్శనం చేశారు. సనాతన ధర్మములో దీపానికి అత్యంత ప్రాధాన్యత కలదని వైదిక పరంపరలో భాగంగా హిందూ సమాజ సంఘటనకు సామూహిక హారతులు ప్రతిబింబిస్తాయి మాఘ పౌర్ణమి బుధవారం మన మైదుకూరు పట్టణంలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా మాతృమూర్తులచే సామూహిక మహా హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం ఆకాశం నుండి చంద్రుడు కూడా మనకు దగ్గరగా వచ్చి మన హారతికి ఆస్వాదించడం ఎంతో మంచి పరిణామమని తెలిపారు. ముందుగా మాతృమూర్తులు ఇంటి ఆవరణంలో ఉండే తులసి మాతకు సాయంత్రం 6:30 నుండి 7:00 గంటల వరకు పూజా కార్యక్రమం.7:00గంటల నుండి 7:15 నిమిషాల వరకు ఇంటి ప్రధాన ముఖ ద్వారం యొక్క గడపకు హారతి పూజ,7:15 నిమిషాల్లో నుండి మన ఇంటి నుండి ప్రధాన రహదారికి రావడం, 7:30 నుండి 7:50 వరకు స్వామీజీల మార్గదర్శనం చేశారు.7:50 నుండి 8:00గంటల వరకు సామూహిక హారతి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక సభ్యులు కృషితో పట్టణంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించి జయప్రదం చేశారు.

# ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించండి




సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

**మదనపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**

ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం మదనపల్లె తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారం ప్రగతిపై తహశీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పిజిఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోపు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మదనపల్లె నుంచి ఎక్కువుగా జిల్లా కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నాయని వాటిని ఇక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు వివాదంలో ఉన్న వాటిని తప్పా మిగిలిన భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. డిసెంబర్ 6నుంచి జనవరి 8వరకు రెవెన్యూ సదస్సులో భాగంగా మదనపల్లె మండలంలో మొత్తంగా 1361 ధరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే కేవలం 285 ధరఖాస్తులు మాత్రమే పరిష్కారానికి నోచుకొన్నాయన్నారు. ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా చూడాలన్నారు. గ్రామాల్లో నేటికి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలే పదే పదే ప్రజలు విన్నవిస్తున్నారన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రజలు కార్యాలయాలకు ప్రతి సోమవారం పిజిఆర్ఎస్‌కు వస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను పరిష్కరించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదే అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడైనా కబ్జాకు గురైతే వెంటనే వాటిని గుర్తించి పరిరక్షించాలన్నారు. విఆర్ఓలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరిగితే తప్పా విషయాలు తెలియవు అన్నారు. ఈకార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహశీల్దార్ ధనంజనేయులు, ఆర్ఐ, విఆర్ఓలు పాల్గొన్నారు.

# కదిలిన వెంకన్న రథం.. తరించిన భక్త జనం

**పులివెందుల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**

గోవిందా. గోవిందా.. నామస్మరణతో పులివెందుల మార్మోగింది. శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటరమణుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు పులివెందుల లో వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భంగా బుధవారం నిర్వహించిన వెంకన్న బ్రంహ రథోత్సవం కన్నుల పండుగలా సాగింది. వెంకన్న రథోత్సవాన్ని చూసి భక్తులు తరించారు. ఉదయం 10 గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చారు. ఆలయ చైర్మన్ వై.ఎస్.మనోహర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం ఉదయదారులను సత్కరించారు. అనంతరం స్వామి రథోత్సవం ప్రారంభమైంది భక్తులు గోవిందా. గోవిందా.. అంటూ రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవం ముందు కళాకారుల వేషధారణలు, కోలాట ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. పలువురు భక్తులు పానీయాలు, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం వరకు రథోత్సవం కన్నుల పండుగలా సాగింది. పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు, రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్సై లు నారాయణ, విష్ణువర్ధన్ లు బందోబస్తు నిర్వహించారు.





# ఉదయం నాటిన బోర్డులు మధ్యాహ్నం పీకి పడేశారు



హెచ్చరిక బోర్డు తీసేసి నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

**పీలేరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**

మేజర్ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 72 2లో చేపట్టిన అక్రమ అక్రమ నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు .తహసిల్దార్ భీమేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు అక్కడ చేపడుతున్న నిర్మాణాలకు అడ్డుకట్టవేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం నేరమని ఇది చట్టరీత్యా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న స్థలాల్లో రెవిన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలం అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి వెళ్లిపోయారు. అధికారులు అటు వెళ్లిపోగానే అక్కడ నిర్మాణాలు చేపడుతున్న వారు అధికారులు నాటిన బోర్డును పీకే అవతల పడేశారు. అధికారులు నాటారని ఆలోచన లేకుండా హెచ్చరిక బోర్డులను పీకే అవతలపడేశారు అనంతరం యధావిధిగా అక్రమ నిర్మాణాలు కొనసాగించారు. ఈ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఇక్కడ ఎవరికీ పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో లేదని చెబుతుండగా అక్కడ నిర్మాణాలు చేపడుతున్న అక్రమార్కులు ఇదే స్థలంలో పట్టాలు ఇచ్చారని రిజిస్టర్ లో కూడా ఎంట్రీలు అయినట్టు చెబుతున్నారు .ఏది ఏమైనా ఈ వ్యవహారం పట్టణంలో దావనం లా వ్యాపించడంతో తీవ్ర సంచలన అంశం అయింది. స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటామని కొనసాగించబోమని చెబుతున్నా కూడా పీలేరు పట్టణంలో విలువైన స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పలు విమర్శలకు తావిస్తోంది.

## రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

**రాయచోటి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**




అన్నమయ్య జిల్లా రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌ను కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ. కోయ ప్రవీణ్ ఐపియస్, జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపియస్‌తో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసుల వివరాలు, స్టేషన్ రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిధిలోని నేరాల సంఖ్య, స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఫిర్యాదు దారులతో గౌరవ మర్యాదలతో ప్రవర్తిస్తూ, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు. ప్రతివారం మహిళా పోలీసులతో కలిసి పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాలలో మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, ఆన్ లైన్, సైబర్ మోసాలు, వైట్ కాలర్ నేరాలు తదితర విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అపార్ట్మెంట్‌లు, షాపుల్లో సి.సి కెమెరాల ప్రాముఖ్యత వివరించి వాటిని అమర్చుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలీసు అధికారులు, మహిళా పోలీసులు బాగా పనిచేసి లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీ, పరిష్కారం అయ్యే విధంగా చూడాలని సూచించారు. ట్రాఫిక్, ఈ చలాన్‌ల పెండెన్సీని తగ్గించే విధంగా చూడాలన్నారు. డీఐజీ వెంట జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) శ్రీ .యం.వెంకటాద్రి, రాయచోటి రూరల్ ఇన్స్పెక్టర్ ఎన్, వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ పి.రాజా రమేష్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ తులసిరామ్, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, శ్రీనివాస్ నాయక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## చెరువు తట్టు భూముల ఆక్రమణపై కలెక్టర్ సీరియస్

### స్మశానానికి అడ్డు లేకుండా చేయాలని ఆదేశం

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

అన్నమాచార్య యూనివర్సిటీ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ సీరియస్ గా మాట్లాడారు. అంతకుముందు పలుమార్లు ప్రజలు చెరువు తట్టు భూమిలో స్మశానాన్ని ఉపయోగించుకునేందుకు అడ్డు తగలకుండా ఆదేశాలు జారీ చేశారు. చెరువు తట్టు భూముల ఆక్రమణలు, ఆ తర్వాత తొలగింపు సందర్భంగా జరిగిన వ్యవహారంపై మీడియాలో వచ్చిన వార్తలపై కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్పందించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గట్టిగా హెచ్చరించారు. చెరువుతట్టు భూమిలో అనాదిగా ఉన్న బోయిన పల్లె ప్రజల స్మశాన వాటికను పూర్తిగా హద్దులు చూపించి స్వాధీనం చేయాలనీ ఆదేశించారు. చెరువుతట్టు భూములు ఆక్రమణలు తొలగింపు సందర్భంగా పాక్షికంగా తొలగించారని వచ్చిన వార్తలపై కూడా స్పందించి పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఎంతో యూనివర్సిటీ యాజమాన్యం పూర్తిస్థాయిలో తొలగించేందుకు బుధవారం పనులు చేపట్టింది. మరోవైపు స్మశానాన్ని కూడా పూర్తిస్థాయిలో ఎంత విస్తీర్ణం ఉందో చదును చేసే పనులు కూడా వారు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ చాంబర్లో రాజంపేట తాసిల్దార్ పేరు మున్ని, సీనియర్ అసిస్టెంట్ కుమార్ స్వామి, యూనివర్సిటీ ప్రతినిధుల సమక్షంలో గ్రామస్తులు చర్చల్లో పాల్గొన్నారు. భవిష్యత్తులో ఎప్పుడు స్మశానానికి వెళ్లేందుకు రహదారి విషయంలో ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.









## ఈ పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



మామిడి తోటను పరిశీలిస్తున్న దృశ్యం

పీలేరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి బి. చంద్రా నాయక్ పీలేరు మండలంలో రబీ సీజన్ లో రైతులు సాగు చేస్తున్న పంటను పరిశీలించారు. బుధవారం ఆయన మండలంలోని రేగళ్ళు, బాలంవారిపల్లి శ్రీకాంత్ రెడ్డికి చెందిన పంట పొలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ప్రతి పంటను ఆర్.బీ.కె సిబ్బంది ద్వారా ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు విశిష్ట సంఖ్యను రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ గ్రామ సహాయకులు ద్వారా పొందాలని తెలిపారు. ఈ నెల 28 లోగా రైతులు విశిష్ట సంఖ్యను వ్యవసాయ గ్రామ సహాయకుల నుంచి పొందాలని తెలిపారు. భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు, చరవాణి తీసుకొని రైతు సేనా కేంద్రాలకు తీసుకెళ్లి తమకున్న భూమికి విశిష్ట సంఖ్య తెలపాలి. ఈ నెంబరు ద్వారా పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ, వివిధ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీలేరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచలకులు వైవి రమణరావు, జిల్లా కార్యాలయం ఎపిఓ మోహన్, మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, టిప కరుణాకర్ రెడ్డి, ఏఈఓలు జహీర్, జ్యోతి, మాజీ సర్పంచ్ సురేంద్ర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలను పరిశీలించిన డిప్యూటీ డిఈఓ

ముద్దనూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఓ మీనాక్షి బుధవారం నాడు పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థినిలతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఓ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులతో ప్రతి ఒక్క విద్యార్థిని ఏకాగ్రతతో పట్టుదలతో విద్యనాభ్యసించి మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాలలో విద్యార్థి ప్రతిభ

పులివెందుల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :

పులివెందులకు చెందినా ఎస్.అర్షద్ అలీ మంగళ వారం విడుదలైన జేఈఈ ఫలితాలలో ప్రతిభ కనిపరిచారు. ఇతను శ్రీ సాయి చైతన్య జూనియర్ కలాశాలలో ఇంటర్ చదివారు. పులివెందుల పట్టణంలో మరి ఏ కాలేజీ సాధించలేని ఫలితాలను సాధించుటలో తమ కళాశాల అగ్రగామిగా నిలుస్తున్నదని పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. విద్యార్థి ఎస్. హర్షద్ అలీ 90. 38 పర్సంటైల్ తో పులివెందులలో టౌన్ టాపర్ నిలిచినందుకు కళాశాల ప్రిన్సిపల్ గంగిరెడ్డి లక్ష్మీనారాయణ , మహేంద్ర అధ్యాపక బృందం అభినందించారు. కళాశాల డైరెక్టర్ ఎ. నీరజ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలను ఐఐటి, జేఈఈ మెయిన్స్, నీట్ లలో సాధించడానికి విద్యార్థులకు మెరుగైన విద్యాను అందించడానికి 2025 2026 విద్యాసంవత్సరం నుండి నూతన విద్యా విధానంలో భాగంగా బాలబాలికలకు వేరువేరు కాంపస్, హాస్టల్ వసతితో ఆకాశ్ విద్యాసంస్థల వారి అనుసంధానంతో కోచింగ్ ఇప్పించి మంచి ఫలితాలను తెప్పించుటకు కృషి చేస్తామన్నారు.

## రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి ఎంపిక



పీలేరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి మరియు తిరుపతి జిల్లాకు నూతనంగా ఎన్నికైన బిజెపి అధ్యక్షుడు శ్రీ సామంచి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బి చంద్రశేఖర్ రెడ్డి పీలేరు అసెంబ్లీ కన్వీనర్ బి వెంకటరమణ పీలేరు మండల బిజెపి అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి బిజెపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుధారాణి పీలేరు బిజెపి పట్టణ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు

## మాల సింహగర్జనను విజయవంతం చేయాలి

బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :



మాల సింహ గర్జన విజయవంతం చేయాలని మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి అన్నారు, ఫిబ్రవరి 16,వ తేదీన ఎమ్మిగనూరులో జరిగే వర్గీకరణ వ్యతిరేకంగా సభను విజయవంతం చేయాలన్నారు, మాల మహాసేన బద్వేల్ నియోజకవర్గంలో మాలలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని మాల సంఘాల అందరూ పెద్ద ఎత్తు పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నారు, ఈ కార్యక్రమంలో మాలలకు సంబంధించిన కొన్ని విషయాలు గురించి చర్చించడం జరుగుతుందని కావున జరగబోయే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు కూడా పాల్గొని జయప్రదం చేయాలని వారు పలువురికి పిలుపునిచ్చారు.

## ఆటో కిందపడి వృద్ధుడు మృతి

మదనపల్లి క్రైమ్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త.

ఆటో నుంచి కిందపడి ఒక వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. మదనపల్లి రూరల్ మండలం చిప్పిలి గ్రామం చెందిన తిప్పన్న(65) సొంత పనులపై మదనపల్లికి విచ్చేశాడు. తిరిగి ఆటోల స్వగ్రామానికి వెళుతుండగా చిప్పిలి సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద ఆటోలో నుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తిప్పన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాలూకా ఎస్సై గాయత్రి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సమస్యల పరిష్కారమే తెదేపా ప్రభుత్వ ధ్యేయం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :

రాష్ట్రంలో అన్ని వర్గాల సమస్యల పరిష్కారమే తెదేపా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి అన్నారు. బుధవారం నల్లపురెడ్డి పల్లి లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సంబందించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. అలాగే పులివెందుల లో శ్రీ వెంకటరమనుడి బ్రహ్మ రథోత్సవం లో ఆమె పాల్గొని పూజలు చేశారు.



## మదనపల్లె అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయండి



కేంద్ర పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే, చినబాబు, నాయకులు

మదనపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబుకు పార్టీ అధిష్టానం సూచించింది. ఇరువురి వర్గీయుల మధ్య మదనపల్లెలో గత ఐదురోజులుగా వివాదాలు తలెత్తుతున్న సంఘటనలు పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రముఖంగా ప్రచురించడం జరిగింది. దీంతో అధిష్టానం వీరి ఇరువురిని బుధవారం విజయవాడ పార్టీ కార్యాలయానికి పిలుపించుకొని ఇద్దరి మధ్య సహోద్య కుదిరించారు. రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి, జోన్ ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి, అన్నమయ్యజిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజులు వారితో మాట్లాడుతూ ఇకమీదట నియోజకవర్గంలో మీ ఇద్దరి మధ్య ఎలాంటి విబేదాలు తలెత్తకూడదని, ఐక్యంగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. మదనపల్లె సర్వతోముఖాభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. పార్టీ నియనమాళిలను ఉల్లంగిస్తే ఎంతటివారైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇకనుంచి ఇద్దరూ ఐక్యంగా ఉండి పనిచేసుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 15ఏళ్ళ తరువాత మదనపల్లెలో టిడిపి గెలిపొందడం జరిగిందని పార్టీ బలోపేతానికి నియోజకవర్గంలోని నాయకులు అందరూ ఎమ్మెల్యేతో కలసికట్టుగా ఉండి పనిచేయాలన్నారు. పార్టీ ఆదేశాలను ఎవరూ ఉల్లంఘించరాదని సూచించారు. నియోజకవర్గ పాలనా వ్యవహారంలో చినబాబు జోక్యం చేసుకోరాదని సూచించినట్లు తెలిసింది. అదే విధంగా తెలుగుయువత కార్యక్రమంలో ఎమ్మెల్యే జోక్యం ఉండకుండా చూసుకోవాని పరస్పర సహకారంతో ముందుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె పరిశీలకులు శివరామ్, ప్రతాప్, కౌన్సిలర్ తులసీరామక్రిష్ణలు పాల్గొన్నారు.

## శ్రీ నల్లవీర గంగమ్మకు మిట్టపల్లె నుంచి చీర, సారె



సారె తీసుకెలుతున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

సిటిఎం శ్రీ నల్లవీర గంగమ్మ జాతర పురస్కరించుకొని గంగమ్మకు పుట్టినిల్లు అయినటువంటి మిట్టపల్లె నుంచి పసుపు కుంకుమ, చీర, సారేలను బుధవారం సమర్పించడం జరిగింది. తొలిపూజ జరిగాక అమ్మవారు ఊరినుంచి ఆలయ ప్రవేశం చేసింది. సిటిఎం క్రాస్‌రోడ్డు సర్పంచ్ బండపల్లె ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో మిట్టపల్లె మేకల వంశస్థులు గంగమ్మకు తొలిపూజ, పట్టుచీర సమర్పణ వేడుక హట్టహాసంగా ప్రారంభం అయ్యింది. ఈకార్యక్రమంలో నాయకులు బండపల్లె అక్కులప్ప, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పూల నాగేంద్ర, పోతబోలు నాగరాజు, ఈశ్వర్, సోము, వెంకటప్ప, శంకర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడంలో ఆర్ఐఓ విఫలం

మదనపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో ఆర్ఐఓ విఫలం అంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సర్వేపల్లె నరసింహ తెలిపారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పోరేట్ జూనియర్ కళాశాలలు ప్రాక్టికల్ మార్కుల పేరుతో విద్యార్థులను నిలువుదోపిడి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జెంగిలి విధానం కాకపోవడంతో స్థానిక కళాశాలల్లోనే నిర్వహించడం ద్వారా ఇష్టం వచ్చినట్లు విద్యార్థులు దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఆర్ఐఓ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే కళాశాల యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయన్నారు. ఆర్ఐఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అఫ్రీద్, జయబాబు, జశ్వంత్ పాల్గొన్నారు.

## సామాజిక సేవకుడు డాక్టరేట్ రమేష్‌కు సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

పీవీకే ఫౌండేషన్ ఛైర్మెన్ మర్రిపాటి రమేష్ ఇటీవల సామాజిక సేవా విభాగంలో భారత్ వర్చువల్ యూనివర్శిటి నుంచి డాక్టరేట్ పొందారు. ఈ నేపథ్యంలో డాక్టరేట్ రమేష్‌కు బాస్ నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. విశ్రాంతి మండల విద్యాశాఖాధికారి పోతబోలు రెడ్డప్ప, రిటైర్డు హెచ్ఎం నరసింహులు, శ్రీనివాసులతో కలసి సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. పూలమాలలు వేసి జ్ఞాపికలు బహుకరించారు. ఈకార్యక్రమంలో బాస్ నాయకులు ముత్యాలమోహన్, రెడ్డప్ప, సురేష్, ఇర్ఫాన్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల అర్జీలను సత్వరం పరిష్కరించాలి



తహశీల్దార్ కార్యాలయంలో సమస్యలపై సమీక్షిస్తున్న కలెక్టర్

కురబలకోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అన్నమయ్యజిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కురబలకోట తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 6నుంచి జనవరి 8వరకు మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన అర్జీల ప్రగతిపై తహశీల్దార్, విఆర్ఓ, విఆర్ఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ని అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారని తహశీల్దార్‌ను ప్రశ్నించగా భూ సమస్యలపై 541 అర్జీలు వచ్చాయని వాటిలో 281 పరిష్కరించినట్లు కలెక్టర్‌కు వివరించారు. పెండింగ్ అర్జీలకు గల కారణాలను విఆర్ఓలను అడిగి తెలుసుకొన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని ఏ ఏస్థాయిలో ఉన్నాయని ఎస్ఎల్ఏ పరిధిలోగా పరిష్కరించేందుకుచర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల్లో ముటేషన్, అసైన్‌మెంటు, ఆర్ఓఆర్ భూసేకరణ, దారి సమస్యలు, అన్నదమ్ముల భాగపరిష్కారాలు, సివిల్‌కేసులు, వివాదాలు తదితర వాటిని సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశ, నిర్దేశం చేశారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్ళి భూ సేకరణ దారిసమస్యలపై విచారిస్తే త్వరగా పరిష్కారం అవుతాయని ఆయన సూచించారు. అర్హులకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు ఎక్కడైనా అక్రమణలకు గురైతే గుర్తించి వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ తపస్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

కురబలకోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :



తనిఖీ చేస్తున్న దృశ్యం

పిల్లలకు ఒడ్డించే మద్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండాలని కురబలకోట ఎంపిడిఓ గంగయ్య అన్నారు. బుధవారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో విద్యాప్రమాణాలు గురించి ఆరా తీశారు. అక్కడి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మద్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి రథోత్సవం

రామసముద్రం,ఫిబ్రవరి2 ప్రభాతవార్త



మండల కేంద్రంలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయం నందు రథసప్తమి వేడుకలలో భాగంగా బుధవారం శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి విశేషాలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. అన్నమయ్య జిల్లా చిత్తూరు జిల్లా కర్ణాటక తమిళనాడు నుంచి స్వామివారిని అనేకమంది భక్తులు దర్శించుకున్నారు. జనసేనపార్టీ నాయకులు .వివిధ రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులు అధికారులు భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించారు. స్వామి వారి బ్రహ్మ రథోత్సవం ముందు మహిళలు కర్పూర హారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు.బలిజ సంఘం నాయకులు ఆలయ ఆవరణములో పెద్ద ఎత్తున గొప్ప అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్వామివారిని దర్శించుకునే విధంగా ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి బట్టర్,కులశేఖర్ బట్టర్, మల్లిఖార్జున స్వామి మరియు అర్చకులు వివిధ హోమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ గౌడ్, గబ్బూరి సుదర్శన్, గబ్బూరి మధు,దినేష్ కోలాహరి, జనార్ధన్, పూల అంజప్ప, లక్ష్మీపతి, స్టూడియో సీన, బ్యాంకు మంజునాథ్, మంజునాథ్, రమేష్,ప్రకాష్, జనసేన నాయకులు, బలిజ కులస్తులు, స్వామి వారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు

రామసముద్రం పిబ్రవరి వరి 12 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని గుంతలపేట అతిపురాతన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆలయం ప్రాంగణంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. బుదవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చనలు, పంచామృతాభిషేకాలు, విశేషా అలంకరణలతో భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండలంలోని గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు మట్లవారిపల్లె గ్రామస్థులు వెంకటేశ్వర జానపద కళా కారుల వారిచే కోలాటాలు, భజనలు నిర్వహించారు.గ్రామస్థులు భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు ఆలయాల్లో పౌర్ణమి వేడుకలు జరిగాయి.

## వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట పిబ్రవరి12 ప్రభాతవార్త:

స్దానిక కోదండరామాలయంలో సీతారా ముల కాల్యాణం ను ఆత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి నెల ఆలయంలో పౌర్ణమి రోజున సీతారాముల కల్యాణంను నిర్వహిస్తారు. ఆందులో బాగంగా బుధవారం స్వామి వారి కాల్యాణంను నిర్వహించారు. బుధవారం వేకువజామునే స్వామివారికి ఆభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఆలంకరించి కల్యాన వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రోచ్ఛారణ మద్య ఆలయ ఆర్చకులు వీణరాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు కల్యాణ తంతును ప్రారంభించారు. సరిగ్గా 10.30 గంటలకు ఉత్స మూర్తులపై జిల్కరా బెల్లం ఆమర్చారు.తరువాత మాంగల్యా దారణ కార్యక్రమం నిర్వహించారు. కల్యోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్లలనుంచి భక్తులు విచ్చేసి కల్యాణంను విక్షీంచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆదికారులు తగిన చర్యలుతీసుకున్నరు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆదికారులు భక్తులు పాల్గోన్నరు.

## సింహ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీ రంగనాధుడు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :



పులివెందులలో వెలసిన శ్రీరంగనాథ స్వామి బుధవారం సింహ వాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ రంగనాథుడి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈవో వెంకటరమణలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ , శశిధర్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ఉభయదారులకు అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర ప్రజలు ,ప్రముఖులు భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పులివెందుల పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు ప్రయోజనం గోకులం షెడ్లు

వేంపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :

రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకే కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేస్తోందని పులివెందుల నియోజకవర్గ తెదేపా ఇంచార్జి మారెడ్డి రవీంద్ర నాథ రెడ్డి (బి.టెక్ రవి) అన్నారు. వేంపల్లి మండలం ముసలిరెడ్డిగారిపల్లిలో గోకులం షెడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో అనుసంధానమైన పాడి సంపదను పెంచుకునే రైతులకు గోకులం షెడ్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు.

## కృష్ణదేవరాయ సర్కిల్లో వసతులు ఏర్పాటు చేయాలి

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:



16వ తేదీ శ్రీకృష్ణదేవరాయ జయంతికి కృష్ణదేవరాయ కూడలిలోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూల ధారణ చేయడాని క్రేన్ సౌకర్యము, నిచ్చెన ఎర్పాటు కోసం బాస్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు దాసరి శివప్రసాద్, వైసిపి నేత తోట కృష్ణ, కార్పొరేటర్లు మల్లికార్జున కిరణ్, రెడ్డి ప్రసాద్, షఫి లు కార్పొరేషన్ అధికారులను కోరారు. ఈమేరకు బుధవారం కడప నగరపాలక సంస్థలో మేయర్ సురేషబాబు, కమిషనర్ మనోజ్ రెడ్డి లను కలిసి వినతి పత్రాన్ని అందించారు. కూడలిని పూలతో సుందరీకరణ చేయాలని కూడా కోరారు.

## ఎస్‌బివిఆర్ విద్యార్థుల ప్రభంజనం

బద్వేలు, ఫిబ్రవరి 12 , ప్రభాతవార్త



యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన 1,3,5 సెమిస్టర్ ఫలితాలలో బద్వేల్ కు చెందిన శ్రీ బిజివేముల వీరారెడ్డి కళాశాల విద్యార్థులు యునివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులను దీనికి కారణమైన అధ్యాపక బృందాన్ని కళాశాల యాజమాన్యం మరియు ప్రిన్సిపాల్ అభినందించారు.

## జేఈఈ మెయిన్స్‌లో గుడిపాడు విద్యార్థి ప్రతిభ

దువ్వూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన వరికూటి వెంకట శ్రీకాంత్ రెడ్డి జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 99.27 మార్కులతో ఉత్తమ స్థానాన్ని పొంది జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించాడు. గ్రామీణ ప్రాంత రైతు కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి గతంలో 10వ తరగతిలో 586 మార్కులు సాధించడమే కాకుండా పాలిటెక్నిక్‌లో జిల్లా ఫస్ట్ ర్యాంక్ కూడ సాధించాడు. విద్యార్థి ఇంత మంచి ర్యాంక్ సాధించడం పట్ల ఆ విద్యార్థి తండ్రి వెంకటరమణా రెడ్డి మరియు తల్లి సంతోషం వ్యక్తం చేశారు. ఈ విద్యార్థి 10వ తరగతి వరకు చదివిన పాఠశాల కరస్పాండెంట్ మూలె రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. త్వరలో జరగబోయే అడ్వాన్స్ పరీక్షల్లో కూడ మంచి ర్యాంకు సంపాదించి ఐఐటీ సీటు ఖచ్చితంగా సాధిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మీరు వేదాలు వల్లిస్తే ఎలా..



ఖాజీపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:

ఖాజీపేటలో వైఎస్ఆర్సీపి జిల్లా జనరల్ సెక్రటరీ పీ.వి రాఘవరెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పి.వి రాఘవరెడ్డి, వైఎస్ఆర్సీపి ఖాజీపేట మండల అధ్యక్షులు దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ మేము మంగళవారం ప్రజల పక్షాణా తహసీల్దార్ వద్దకు వెళ్లి రేషన్ షాపు డీలర్లు 2కేజీలు తక్కువ ఇస్తున్నారని లబ్దిదారులకు న్యాయం చేయాలని వినతి పత్రం ఇచ్చామని, దానికి తహసీల్దార్ ఎంక్వైరి చేసి లబ్దిదారులకు సక్రమంగా రేషన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడం జరిగిందన్నారు. కానీ కొంతమంది టీడీపీ నాయకులు విలేకరుల సమావేశంలో వైసీపీ వాళ్లు బ్యాక్‌లాగ్ ఇచ్చినారు అందుకు మేము రెండు కేజీలు తక్కువ ఇస్తున్నామని వారి నోటి గుండా వారే ఒప్పుకోవడం జరిగిందన్నారు. మంగళవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన వ్యక్తి సొంత గ్రామం రావుల పల్లె నుంచి మేము టీడీపీ గవర్నమెంట్ వచ్చినప్పుడు మా డీలర్ ఎటువంటి బ్యాక్ లాగ్ లేకుండా ఇవ్వడం జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు కూడ విలేకరులకు చూపించం జరిగిందన్నారు. కానీ గత నెలలో అదే రావులప్లి నుంచి 26 క్వింటాళ్ల 82కేజీలు బ్యాక్‌లాగ్ చూపించడం జరిగింది. ఇది మీ గవర్నమెంట్ వచ్చిన తర్వాత జనవరి నెలలో బ్యాక్‌లాగ్, దాంతో పాటు మీరు లబ్దిదారులకు పనికిరాని పురుగు పట్టిన జొన్నలు ఇస్తున్నారు పశువులు కూడ తినని విధంగా ఉన్నాయి అన్నారు. అలాంటివి మీరు పంపిణి చేస్తూ ఎదుటి వారి మీద నిందలు వేస్తూ మీరు నిజాయితీ గురించి మాట్లాడితే ఎలా. ఈ సమావేశంలో జిల్లా జనరల్ సెక్రటరీ పివీ రాఘవరెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ ముత్తూరు వెంకట సుబ్బయ్య, మండల అధ్యక్షులు డి.మురళీమోహన్ రెడ్డి, కూనవారి పల్లె సర్పంచ్, దుంపలగట్టు సర్పంచ్ రామకృష్ణారెడ్డి, పత్తూరు ఎంపీటీసీ డి.రాముడు, దుంపలగట్టు వెంకటరామిరెడ్డి, ఏటూరు నాయకులు అంబటి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలి



సిద్దవటం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:

మండలంలోని టక్కోలి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు జిల్లా ఎస్పీ జి.అశోక్‌కుమార్ ఆదేశాలతో విద్యార్తులు మంచి పౌరులుగా ఉండాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పరిషత్ హైస్కూల్లో మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులు బాగా చదువుకొని సమాజానికి దేశానికి సేవ చేయాలని మీ తల్లిదండ్రుల ఆశల్ని ఆశయాలను నెరవేర్చేలా కృషి చేసి విజయం సాధించాలని దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకొని నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు హెడ్మాస్టర్ ఉమామహేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

సిద్దవటం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



సిద్దవటం మండలంలోని సిద్దవటం రైతు సేవా కేంద్రంలో వెలుగుపల్లి గ్రామంలో సొంత పొలం కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే అన్ని పథకాలను పొందాలంటే రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేసుకొని లబ్ధి పొందాలన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకం లబ్ధి పొందాలంటే రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకొని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుకు ఎన్ని గ్రామాల్లో పొలం ఉన్నా ఎక్కడో ఒక చోట మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుందని తెలిపారు. ఈ విధంగా రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరు, పాస్ పుస్తకం తీసుకొని మీ పరిధిలోని రైతు సేవా కేంద్రంలోని వనయవసాయ సమాయకులని సంప్రదించాలన్నారు.

## పుట్టాయపల్లి లో బద్వేల్ రూరల్

## పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఉత్తర్వుల మేరకు బద్వేల్ మండలం, పుట్టాయపల్లె గ్రామం నందు బద్వే లు రూరల్ ఇన్స్పెక్టర్ నాగభూషణ్ మరియు బద్వేల్ రూరల్ ఎస్ ఐ శ్రీకాంత్ లు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా, సీఐ గ్రామ ప్రజలతో మాట్లాడి గ్రామం ఉండే సమస్యల గురించి అడిగి తెలుసుకొని, చిన్న,చిన్న తగాదాలకు ఆవేశపడి గొడవలు చేసుకోవద్దని, ఏదైనా చట్టపరిధి లో సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనమోతుందని తెలిపారు. అలాగే సైబర్ నేరాలు, సమాజములో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపైన, ట్రాఫిక్ నియమాలు గురించి తెలిపి, ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని మరియు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తెలపడం అయినది.



## శివుని ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలి



తంబళ్లపల్లె ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ః
మల్లయ్యకొండ మహాశివుని ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం జయచంద్రారెడ్డి, సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, కురబలకోట మండల పార్టీ అధ్యక్షుడు సురేంద్రలకు ఆలయ ప్రధాన అర్చకులు ఈశ్వరప్ప స్వామి శివమాలధారణ గావించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులు నిర్వహించారు. ఆలయ ఈవో మునిరాజా శివ మాలధారణ స్వాములను దృశ్యాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మల్లయ్య కొండ మహాశివరాత్రి పర్వదినాన జరిగే ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకుని హాజరయ్యే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఈవో మునిరాజాకు సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ఉత్తమ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ బేరి శ్రీనివాసులు, పెద్దేరు ప్రాజెక్ట్ చైర్మన్ కొటాల శివకుమార్, రామచంద్ర, గంగుల్ రెడ్డి,మాజీ సర్పంచ్ లక్ష్మి నారాయణ నాయుడు, సోమశేఖర్, ఆనంద్ నాయుడు, కాలా నారాయణ, పెద్ద వీరభద్ర, జైపాల్ నాయుడు,, మధు, ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, కొండ కిట్ట, మాధవరెడ్డి, అల్లావుద్దీన్, రాజన్న, పీర్ల మాబు, ఐసుల కిట్ట, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పశువు అమ్మకంపై విచారణ



పశువు అమ్మకంపై విచారణ చేస్తున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

తంబళ్లపల్లె ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ః
తంబళ్లపల్లె మల్లయ్య కొండ మహాశివునికి దాతలు పశువులు దానం ఇవ్వడం ఆనవాయితీ. ఆ పశువుల్లోఓ కోడె దూడ ఇతర పశువులను కుమ్ముతోందని అమ్మడం జరిగింది. దాని బదులుగా వేరే కోడె దూడను కొంటామని ఆలయ ఈవో తెలిపారు. అయితే ఎవరి అనుమతితో పశువును అమ్మారని స్థానిక టిడిపి నాయకులు బురుజు వెంకటరమణ, పురుషోత్తం, వీరాంజనేయులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సై లోకేష్ రెడ్డి ఆలయ ఈవో మునిరాజా తోబాటు ఫిర్యాదు దారులతో విచారణ జరిపి సమస్య పరిష్కరించి భవిష్యత్తులో దేవాదాయ శాఖకు సంబంధించిన పశువులు, ఆదాయ వనరుల క్రయ, విక్రయాల పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా అందరి ఆమోదంతో చట్టబద్ధంగా చేపట్టాలని వారికి హితవు పలికారు.

## నాసిరకం పనులపై ఉపేక్షించేది లేదు



మల్లయ్యకొండ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ః
మల్లయ్యకొండలో అభివృద్ధి పనులు నాసిర కంగా ఉన్నాయని వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి రికవరీ చేపట్టే విధంగా చర్యలు చేపడతామని తంబళ్లపల్లి టిడిపి ఇన్చార్జ్ జయచంద్ర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కాలినడకన గత పాలకులు చేపట్టిన గెస్ట్ హౌస్ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయని విమర్శించారు. దైవ సన్నిధిలో చేపట్టిన పనులలో సైతం ఇంతగా దిగజారడం సిగ్గుచేటన్నారు. నేడు మంజూరైన మరుగుదొడ్లు, ఇతర అభివృద్ధి పనులు నాణ్యత లోపించకుండా నిర్మాణాలు జరిగే విధంగా చూడాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన హాజరయ్యే లక్షలాది భక్తులకు తాగునీటి సౌకర్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్డబ్ల్యూఎస్ డి ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఎఈ వినోద్ కుమార్, మాధవ రెడ్డిలకు సూచనలు ఇచ్చారు. కొండపై భక్తుల సౌకర్యాల ఏర్పాటులో స్వచ్ఛందంగా సహకరించాలని నాయకులు ఉత్తమ రెడ్డి, బేరి శ్రీనివాసులు, రెడ్డప్ప రెడ్డి, సోమశేఖర్, ఆనంద్ నాయుడులకు సూచించారు.

## ఉపాధి పనుల్లో రూ.62153 రికవరీ

వీరపునాయునిపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :
మండలంలో జరిగిన ఉపాది హామీ పనుల్లో రూ.62153 రికవరీ చేస్తున్నట్లు ఏపీవో లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం జరిగిన ఓపెన్ ఫోరంలో ఉన్నతాధికారులు చేసిన సూచనల మేరకు ఈ డబ్బులను రికవరీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

రామాపురం : ఫిబ్రవరి 12 ప్రభాత వార్త
రాయచోటి వేంపల్లి రహదారిలోని కుమ్మరపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్ను గుర్తు తెలియని వాహనం ఢీకొని శ్రీనివాసులు. జహీరిన్‌లకు గాయాలు అయినట్టు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇరువురు ఇంటి వద్ద నుంచి పొలంలో ఉలవకాయ కోసేందుకు స్కూటర్లో వెళుతూ ఉండగా మార్గమధ్యంలో కుమ్మరపల్లి సమీపంలోకి వెళ్ళగానే వేనుక వైపు నుంచి లక్కిరెడ్డి పల్లి నుంచి రాయచోటి వైపు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు వీరిని ఢీకొని వెళ్లిపోయారని తెలిపారు. సంఘటనలో శ్రీనివాసులకు కాలు ప్యాక్చర్ అయింది జహీరిన్‌కు గాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఏపీఈఈయూ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు

వేంపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :
బుధవారం ఏపీఈఈయూ 1104 యూనియన్ 75 సంవత్సరాలు ఆవిష్కరణ ముగించుకొని 76వ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల డివిజన్‌లోని ఏపీఈఈయూ 1104 యూనియన్ బిల్డింగ్ దగ్గర జెండా ఆవిష్కరణ చేసారు. అలాగే రిటైర్డ్ అయినటువంటి యూనియన్ సిబ్బందిని సత్కరించారు. విద్యుత్ కార్మిక సమస్యలను విన్న యూనియన్ నాయకులు తమ సమస్యలను రీజినల్, స్టేట్ బాడీ దగ్గరికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ఆవిష్కరణ దినోత్సవ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అశోక్ బాబు, పులివెందుల డివిజన్ అధ్యక్షత వహించిన ఎం పుల్లయ్య, డివిజన్ ప్రెసిడెంట్ అంతేకాకుండా రిటైర్డ్ అయినటువంటి విద్యుత్ కార్మిక సోదరులు, రెగ్యులర్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డివిజన్ ప్రెసిడెంట్ ఎం.పుల్లయ్య, ఎస్ఎల్ఐ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి అబ్దుల్ సలీం, లైన్‌మెన్, డివిజన్ సెక్రెటరీ ఎంవీ సుదర్శన్, ఎల్ఐ, డివిజనల్ అడిషనల్ సెక్రెటరీ జి వేణుగోపాల్, లైన్మెన్, డివిజనల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి హేమచంద్ర లైన్మెన్, డివిజనల్ ఆర్గనైజింగ్ ట్రెజరర్ ఏ వెంకటరత్నం, లైన్మెన్, పులివెందుల డివిజన్ కార్యవర్గం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఎంప్లాయిస్ యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



ప్రొద్దుటూరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రి.నెం.1104 ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయ ఆవరణలో ప్లాటినం జూబ్లీ వేడుకలను బుధవారం నిర్వహించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి అనంతరం జిల్లా ప్రాంతీయ అధ్యక్షులు యూఎస్ కెనడి బర్నబాస్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బర్నబాస్ మాట్లాడుతూ ఏపీ ఎలక్ట్రిసిటీ యూనియన్ 1104ను స్వర్గీయ మల్లికార్జునరావు ఏడు మంది సభ్యులతో స్థాపించారని, నేటికీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని 76వ సంవత్సరంలో అడిగి పుట్టబోతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారిన పార్టీలు మారినా పరిస్థితులు మారిన ఏ ప్రభావం యూనియన్ మీద పడకుండా కేవలం కార్మికుల సంక్షేమం కొరకు కార్మికుల చేత నడపబడుతున్న గుర్తింపుబడిన ఏకైక యూనియన్ ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అన్నారు. యూనియన్ డివిజన్ సలహాదారులు ఎస్ఎ గఫూర్ మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఏ రాజకీయ పార్టీలకు లోను కాకుండా స్వతంత్రంగా కార్మికుల చేత పనిచేస్తున్న ఏకైక యూనియన్ 1104 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై కృష్ణమూర్తి అధ్యక్షులు సి మాధవ డివిజనల్ కార్యదర్శి ఎస్ షరీఫ్ డివిజనల్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఉమామహేశ్వరరావు డివిజనల్ సహాయ కార్యదర్శి రేణుకా రెడ్డి మరియు విద్యుత్ ఉద్యోగులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎంఆర్ఐ, సిటీస్కాన్లపై ఆంక్షలు తగదు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



గత కొన్ని రోజులుగా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఎమ్మారై, సిటీస్కాన్‌లపై ఉన్నత వైద్యాధికారులు ఆంక్షలు విధించడం సరికాదని తక్షణమే ఎమ్మారై సిటీ స్కాన్‌లు పేద ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎస్ ఇర్ఫాన్ భాషా డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి సందర్శించిన ఆయన ఆసుపత్రిలో ఉన్న రోగులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో కేవలం వైద్యులు మాత్రమే ఎమ్మారై సిటీ స్కానింగ్‌లకు సిఫారసు చేయాలనే ఆంక్షలు విధించడం సబబు కాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి సూపరిండెంట్‌తో పాటు ఏ వైద్యునికైనా స్కానింగ్‌లకు సిఫారసు చేసేలా అధికారాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు పేద ప్రజలకు ఇబ్బంది కలగకుండా యధావిధిగా స్కానింగ్లు నిర్వహించాలని ఆసుపత్రి సూపరిడెంట్‌ను ఆయన కోరారు. ఈ సమస్య ఇలానే కొనసాగితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అవసరమైతే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అమరావతి మరియు హెల్త్ మినిస్టర్‌కి ఫిర్యాదు చేయడానికి వెనకాడమన్నారు.

## రోడ్డుపై బండ్లు, వాహనాలు నిలిపితే చర్యలు



బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :
మున్సి పాలిటీ పరిధిలోని పలు ప్రధాన రహదారులు అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ రవికుమార్ తోటి పోలీస్ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ చేపట్టి వాహనదారులకు సలహాలు సూచనలు ఇచ్చారు, రోడ్డుపై వాహనాలు, తోపుడు బండ్లు, ఎక్కడపడితే అక్కడ పెట్టి ట్రాఫిక్ అంతరాయానికి పాల్పడవద్దన్నారు, వాహనాలు తోలే ప్రతి ఒక్కరు పోలీసులు అమలు చేసిన నిబంధనలు పాటించి వాహనాలను నిదానంగా నడుపుతూ సురక్షితంగా తమగమ్య స్థానాలకు చేరుకునే విధంగా వాహన దారులు ఉండాలని సూచించారు, మద్యం సేవించి సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వలన అనేక ప్రమాదాలకు దారితీస్తుంది అన్నారు, తోపుడు బండ్లు వ్యాపారస్తులు ఆటో వాళ్ళు పలు వాహనదారులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పలువురికి హెచ్చరించారు.

## పారదర్శకంగా మంజూరు చేయాలి

బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:



ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బిసి,ఓబీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం వందలాది మంది నిరుద్యోగ యువత అప్లై చేసుకున్నారని వీటిలో పారదర్శకంగా ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్కే ఆదిల్‌లు తెలిపారు. బుధవారం పట్టణ నాయకులతో కలసి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రుణాల మంజూరు కోసం ఎదురు చూస్తూ వున్నారన్నారు. రుణాల మంజూరులో రాజకీయ జోక్యం నివారించి సెలెక్టెడ్ వ్యక్తులకే ఇస్తే ఏమి ఉపయోగకరం వుండదని అర్హులు నష్టపోతారన్నారు. అధికారులు పారదర్శకంగా ఇంటర్వ్యూలు జరిపి అర్హులైన అందరికీ రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. సమావేశంలో డివైఎఫ్ఐ మహిళాకన్వీనర్ సి గురుదేవి, కో కన్వీనర్ ఎస్కే ఫాతిమా, సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సంరక్షణ

ఎడ్యుకేషన్: ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:



నిహార్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రామయ్య యూనివర్సిటీ బెంగళూరు సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ లో గ్రామీణ యువతకు ఆరోగ్య అవగాహనపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆరోగ్య నిపుణుడు సయ్యద్ మహమూద్ భాష పాల్గొని, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల ప్రాముఖ్యతపై వివరించారు ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరి హక్కు అయినప్పటికీ, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ఇప్పటికీ ఒక సవాలుగా ఉంది. అన్నారు తగిన అవగాహన లేకపోవడం, వైద్య వసతుల కొరత, ఆర్థిక పరిమితుల కారణంగా చాలా మంది సరైన సమయంలో వైద్యం పొందలేకపోతున్నారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించడం ద్వారా నివారించదగిన వ్యాధులను తగ్గించవచ్చని వివరించారు. టీకాలు, ఆరోగ్య తనిఖీలు, మరియు జీవన వ్యాధుల నివారణపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి పరిశుభ్రత, తాగునీటి ప్రాముఖ్యత, మరియు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణపై ప్రచారం చేయాలి గర్భిణీలకు ప్రసవపూర్వ సంరక్షణ, టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి. సమగ్ర వైద్య సదుపాయాలు, అవగాహన కార్యక్రమాలు, మరియు ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యంతో గ్రామీణ ఆరోగ్య సంరక్షణను మరింత మెరుగుపరచగలమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో నిహార్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు, మరియు గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

పీలేరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :



ఆపరేషన్లకు ఎంపికైన వారు

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సంఘం అధ్యక్షులు వగళ్ళ చంద్రా రెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న పెన్షనర్ల సంఘం కార్యాలయంలో తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ వైద్య బృందం ఈ వైద్య శిబిరం నిర్వహించిందన్నారు. కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న 100 మంది వైద్య శిబిరంలో పాల్గొన్నారు. వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో ఉచిత శుక్లం ఆపరేషన్లకు ఎంప్లాయీస్ హెల్త్ కార్డ్ దారులు 7 మందిని, అలాగే ఆరోగ్యశ్రీ కార్డ్ దారులు 9 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల కొరకు ఎంపిక చేశారని అన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని వైద్య బృందం తిరుపతిలోని అమెరికన్ ఐ హాస్పిటల్ కు తీసుకు వెళ్లడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యం బృందంతో పాటు పెన్షనర్ల సంఘం నాయకులు నరసింహారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి ర్యాంకును సాధించిన మేధా డిగ్రీ ఆణిముత్యాలు

మైదుకూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



యోగి వేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ రెగ్యులర్ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాలలో శ్రీ మేధా డిగ్రీ కళాశాల విద్యార్థులు పదికి పది మార్కులు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ ర్యాంక్‌లో నిలిచి తమ సత్తా చాటారాని కళాశాల చైర్మన్ శ్రీ చెన్నంశెట్టి నరసింహులు తెలిపారు. కళాశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరైన విద్యార్థులను అభినందించారు. బి జెడ్ సి గ్రూప్ లో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన మా విద్యార్థిని బి వైష్ణవి(10/10), తో పాటు పలువురు విద్యార్థులు ఉత్తమ శ్రేణి పలితాలు సాధించడం పట్ల అభినందనలు పొందారు. ఈ కార్యక్రమంలలో ప్రిన్సిపాల్ శెట్టి శ్రీనివాసులు అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## స్మగ్లర్ అరెస్ట్ ఎర్రచందనం స్వాధీనం

పీలేరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :



నిందితునితో సహా ఎర్రచందనం స్వాధీనం

అటవీ శాఖ పరిధిలో ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసి ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎఫ్ఓ గురు ప్రభాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి చెన్నైకి ఎర్రచందనం దొంగలు అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు పీలేరు చిత్తూరు మార్గం ఎం జె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బుధవారం వేకువ జామున సిబ్బందితో నిఘా ఏర్పాటు వాహనాల తనిఖీలు చేపట్టారు .పీలేరు వైపు నుంచి వచ్చిన వాహనం ఆపకుండా వేగంగా దూసుకెళ్లింది సిబ్బందితో వెంబడించగా అశోక్ నగర్ వద్దకు వెళ్లగానే కారును చీకట్లో ఆపి దుండగులు పారిపోయారు. పారిపోతున్న వారిలో ఒక స్మగ్లర్ని అదుపులోకి తీసుకున్నారు, వాహనం పరిశీలించగా 301 కిలోల బరువు ఉన్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని పీలేరు అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన స్మగ్లర్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేష్ (41 )గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎఫ్ఓ వివరించారు.

## సామాజిక తనిఖీ సమన్వయ సమావేశము



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్ రహీం.

కలకడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :
సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ సిబ్బందికి సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మండలం నందు ఉపాధి హామీ పథకం సంబంధించి 2023, 2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేయుటకు గానూ సామాజిక తనిఖీ బృందం రావడం జరిగింది. సదరు సామాజిక తనిఖీ సంబంధించి సమన్వయ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి అబ్దుల్ రహీమ్ వారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. 13.02.2025 వ తేదీ నుంచి ఎస్ ఆర్ పి మరియు నలుగురు డి ఆర్ పి ల ఆధ్వర్యంలో 16 గ్రామ పంచాయతీలలో నిర్వహించడం జరుగుతుంది. ఇందులో 2023,2024 సంవత్సరంలో జరిగిన 486 పనులకు గానూ 7.47 కోట్ల రూపాయలు ఖర్చు సంబంధించి ఆడిట్ చేయడం జరుగుతోంది. ఈ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశమునకు మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు మరియు ఉపాధి హామీ సిబ్బంది హాజరు కావడం జరిగింది. ఏపీవో చెన్నకేశవులు సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి సుబ్బారావు మరియు డిఆర్పిలు కూడా హాజరు కావడం జరిగిందన్నారు.

## శివ దీక్షాదారుల భిక్షాటన



పట్టణంలో శివమాలదారుల బిక్షాటన కార్యక్రమం

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త :
మహా పాశస్తం కలిగిన శివ భక్తుల భిక్షాటన బుధవారం ప్రొద్దుటూరులో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం స్థానిక రామేశ్వరం ముక్తి రామలింగేశ్వర స్వామి దేవస్థానం నుంచి ఆరంభమై గాంధీరోడ్డు, జమ్మలమడుగు రోడ్డు, శివాలయం వీధి వరకూ సాగింది. దాదాపు 50 మందికి పైగా శివభక్తులు పాల్గొన్న ఈ భిక్షాటన అగస్త్యేశ్వరాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా శివభక్తులు మాట్లాడుతూ పరమేశ్వరుడు అప్పట్లో లోక కళ్యాణం కోసం బిక్షాటన నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ అదే సాంప్రదాయాన్ని పాటిస్తున్నామని తెలిపారు. 23 ఏళ్లుగా ఈ క్రతువును జరుపుతున్నట్టు వివరించారు. శివదీక్ష 23 వ వార్షిక పురస్కరించుకొని ఈ భిక్షాటన నిర్వహించినట్టు తెలిపారు. భక్తుల ద్వారా వసూలైన డబ్బులను స్వామివారి అన్నదానం, హోమాలకు వినియోగిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కే. శ్రీనివాసులు, శివ భక్తుల బృందం పాల్గొన్నారు.

## ఏడుగురు పంచాయతీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

గాలివీడు, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):
విధులకు దుమ్మా కొట్టిన ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. బుధవారం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన ఎంపీడీఓ చాలా చోట్ల సచివాలయం సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా గైర్హాజరవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో వివిధ సచివాలయాలకు సంబంధించి గైర్హాజరైన వారు ఎస్.రసూల్‌బాషా, జె.మదన్‌మోహన్, ఏ.భార్గవి, పి.జ్యోతి, కె.లావణ్య, కెవి సుధాకర్, టీఎస్ యశోదమ్మ వీరు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా గైర్హాజరు అవ్వడంపై రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు.

## రైతులకు గుర్తింపుకార్డు తప్పనిసరి



గాలివీడు, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):
మండలంలో రైతులందరూ ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో తమ పేరు, వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గాలివీడు మండల వ్యవసాయాధికారి గౌతమి పేర్కొన్నారు. మండలంలోని గరుగుపల్లి గుండ్లచెరువు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రైతుల వివరాలు రిజిస్ట్రేషన్ చేసి వారికి 11 నెంబర్ల విశిష్ట సంఖ్యను పూర్తి చేసి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలివీడు మండలంలోని రైతులందరికీ ప్రతి ఒక్కరూ వారి వారి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డు లింక్ ఉన్న ఫోన్ నెంబర్ తీసుకొచ్చి సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని 11 నెంబర్ల విశిష్ట సంఖ్యను పొందాలని సూచించారు. కంది రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. క్వింటా మద్దతు ధర రూ.7550 చెల్లిస్తారని, రైతులు పండించిన కందులు విక్రయించుకునేందుకు ఈ నెల 10 నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన ప్రారంభమైందని రైతులు సద్వినియోగం చేసు కోవాలని ఆమె సూచించారు. మార్కెట్లో క్వింటా ధర రూ.3,800 నుంచి రూ.4 వేలు పలుకుతోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో సుమారు రూ.3,500 వరకు రైతులకు లబ్ది చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## శివాలయంలో మాఘ పౌర్ణమి విశేష హోమాలు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



అగస్త్యేశ్వరాలయంలో హోమం

పట్టణ నడిబొడ్డున వున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో మాఘ పూర్ణిమ సందర్భంగా బుధవారం ప్రాతః కాలం నుండి స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి సహస్ర నామ కుంకుమార్చనలు, ఉదయ ఆరు గంటలకు విశేషంగా గోపూజ, గణపతి నవగ్రహ ఉపగ్రహ ఉప దేవత చండీ మహాహోమాలు ఆలయ ఈవో కే.రామచంద్రా చార్యులు, ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో అర్చక స్వాములు, వేదపాఠశాల గురువు, శిష్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## చర్యలు తీసుకోవాలి

సుండుపల్లె, పిబ్రవరి12, ప్రభాతవార్త:



మండల పరిధిలోని ముడుంపాడు గ్రామపంచాయతీ లోని పింఛా ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువ అడ్డు కట్టలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.

## శబ్ద నియంత్రణ,
## కాంతి వినియోగంపై విద్యార్థులకు అవగాహన



కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:
భవన నిర్మాణంలో శబ్ద నియంత్రణ, కాంతి వినియోగం గురించి స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ డా. ఆర్.ఎన్.ఎస్. మూర్తి విద్యార్థులకు వివరించారు. బుధవారం కడపలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ అకౌస్టిక్స్ అండ్ లైటింగ్, హౌసింగ్ అంశాలు గురించి తెలిపారు. శబ్ద శోషక పదార్థాల వినియోగం, ఇంధనాన్ని ఆదా చేసే దీపాల అమరిక వంటి అంశాలను వివరించారు. విద్యార్థుల అవగాహన పెంపొందించేలా వాస్తవ జీవన ఉదాహరణలు అందించడంతో పాటు, తన వృత్తిపరమైన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో ప్రేమ్, సమీర్, విజయ్ నాయుడు, అవినాష్ రెడ్డి, డా. ఈశ్వరరావు, డాక్టర్ జి. ఫణీంద్ర రెడ్డి, ఆర్కిటెక్చర్, ప్లానింగ్, గేమ్ డిజైన్ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

## శ్రీ పాలేటమ్మ అలయ అభివృద్ధికి వితరణ



కురబలకోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :
తెట్టు గ్రామంలోని శ్రీ పాలేటి గంగమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు ఆర్థికసాయాన్ని ఆలయ ధర్మకర్త పూజారి అంజికి అందజేశారు. చింతమాకులపల్లె గ్రామానికి చెందిన సిద్దల ఈశ్వరమ్మ, శివారెడ్డి దంపతుల కుమారుడు ప్రదీప్‌రెడ్డి, పుష్పాంజలి ఆలయంలో భోజనశాల, భక్తుల కోసం రేకులషెడ్లు నిర్మాణానికి రూ.1.1116లను విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఈ నిధులను వెచ్చించాలని దాతలు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఘనంగా అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణం

సిద్దవటం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



మండలంలోని భాకరాపేట గ్రామ శివారులోని శివునిపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కాశిరెడ్డి నాయన స్వామి 23 వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వర్థ నారాయణ స్వామి (వేపచెట్టు, రావిచెట్టు) కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుడు రామకిశోర్ వేద మంత్రాలతో స్వామి వారికి గణపతి పూజ, పుణ్యహావాచనం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. బొగ్గిడివారిపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి దంపతులు స్వామి కల్యాణం జరిపించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకిపురం హౌసింగ్ ఇన్‌ఛార్జి ఏఈగా చంద్రశేఖర్‌రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:
వాల్మీకిపురం హౌసింగ్ ఇన్‌ఛార్జి ఏఈగా కలికిరి ఏఈ చంద్రశేఖర్‌రెడ్డిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాల్మీకిపురం హౌసింగ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఏఈ ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో కలికిరి మండలం హౌసింగ్ ఏఈని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# వైభవంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం





**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధి గౌరీ శంకర్ నగర్ లో వెలిసిన శ్రీ రమాదేవి సహిత శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో మాఘ మాసం పురస్కరించుకొని పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షులు చెప్పలి వెంకటేశ్వర్లు, కార్యదర్శి తంగి సత్యనారాయణ శర్మ కోశాధికారి బోయ లకుంట్ల సుబ్బనరసయ్య, ఉపాధ్యక్షులు సింగంపల్లి శివయ్యస్వామి తోపాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కనుల పండగగా శ్రీ రమాదేవి సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శ్రీ రమాదేవి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంతాల నుంచి సుమారు 50 జంటల పైగా భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి స్వామి వారి వ్రత మహోత్సవాన్ని తిలకించారు. గతంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేపించుకోవాలంటే దూర ప్రాంతాలైన అన్నవరం లాంటి పెద్ద నగరాలకు వెళ్లి లేదంటే వారి స్వగృహంలో వ్రతం చేపించుకోవాలంటే అధిక మొత్తం లో చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉండేది, అయితే బద్వేల్ ప్రాంత ప్రజలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవంలో అందరూ భాగస్వాములయ్యే విధంగా ప్రతి ఒక్కరికి కూడా అవకాశం కల్పిస్తూ ప్రతి నెలలో పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారి వ్రత మహోత్సవాన్ని నిర్వహించడం పట్ల బద్వేల్ ప్రాంతంలో ప్రజలందరూ కూడా ఆనందం వ్యక్తం చేస్తూ సామూహిక సత్యనారాయణ వ్రత మహోత్సవాన్ని తిలకించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఉట్లా సుబ్బారామయ్య సతీమణి సరోజనమ్మ, మదల్లపల్లె సత్యం, పుట్ట సంజీవరాయుడు, శ్రీకాకుళం వెంకటసుబ్బయ్య, సుభాష్, మేడా పెంచలయ్య, సముద్రాల వెంకటేశ్వర్లు, కొలిశెట్టి కృష్ణయ్య, వడ్లకుంట శ్రీనివాసులు, మదలపల్లె వాసు, హర్ష, డెకరేషన్ సత్యనారాయణ, బండారు సాయి, తోపాటు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు రమేష్ శర్మ, కోటయ్య శర్మ, ఆదినారాయణ, కామేశ్వరరావు తోపాటు పలువురు పాల్గొన్నారు

# యోగాతో మానసిక ప్రశాంత


సంస్థ నిర్వాహకులను సన్మానిస్తున్న దృశ్యం

**పీలేరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
యోగ సాధన ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ ప్రశాంతతను పొందడం ద్వారా అనేక రకాల జబ్బులను ఏ విధంగా తగ్గించుకోవచ్చు అనే అంశంపై స్థానిక షీ దివ్య యోగ విద్యాలయం కోటపల్లి రోడ్డులో నూతనంగా ప్రారంభించిన యోగా కేంద్రంలో విజయవాడ నుండి వచ్చిన ప్రముఖ యోగ, ఆయుర్వేద నిపుణులు డాక్టర్ మాణిక్యేశ్వరరావు అవగాహన కల్పించడం జరిగినది అని షీ సంస్థ నిర్వాహకులు డాక్టర్ పివిఎస్ లక్ష్మి, సలహాదారులు రాయల సుధాకర్ తెలియజేశారు. డాక్టర్ మాణిక్యేశ్వరరావు మాట్లాడుతూ నేటి సమాజంలో ఒత్తిడిని అన్ని వయసుల వారు ఎదుర్కొంటున్నారని ప్రతినిత్యం యోగలోని ప్రాణాయామ ధ్యానాలను సాధన చేయడం ద్వారా వీటిని అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపగలరని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేయడం జరిగినది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ మమత లక్ష్మి శ్రీనివాస్ గుప్తా హాస్పిటల్ నుండి పాల్గొని అనేక రకాల జబ్బులకు మందులను వాడుతూ యోగ సాధన కూడా చేయడం వలన జబ్బుల నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉందని ముఖ్యంగా మహిళలకు సంబంధించిన అనేక రకాల జబ్బులకు యోగ ఒక వరం అని తాము కూడా నిత్యం సాధన చేస్తున్నట్లు తెలియజేశారు. యోగ పై చక్కటి వివరణ ఇచ్చినందుకు వారిని ఆహ్వానించి ఇక్కడ యోగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నటువంటి షీ సంస్థ వారిని డాక్టర్స్ అసోసియేషన్ తరపున ఘనంగా సన్మానించడాం జరిగినది. మాస్టర్ గణేష్ వివిధ రకాల ఆసనాలతో అందరిని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో యోగసాధకులు ఆకులభాస్కర్, కిరణ్ కుమారి ,భువనేశ్వరి వివిధ రంగాల యోగ ఔత్సాహకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చంద్రబాబుపై నమ్మకం.. తెదేపా లోకి వలసల పర్వం

**పులివెందుల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**
రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ముఖ్య చంద్రబాబు నాయుడు పై ఉన్న నమ్మకంతో వైకాపాను వీడి తెదేపాలో చేరుతున్నారని పులివెందుల తెదేపా ఇంచార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి (బి.టెక్ రవి) అన్నారు. బుధవారం పులివెందులలోని తెదేపా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పులివెందులకు సంబంధించి 33 వార్డులు ఉండగా అందులో 30 వ వార్డు షహిదా అనే మహిళ కౌన్సిలరు టిడిపిలో చేరారని తెలిపారు. బుధవారం 13వ వార్డ్ కు చెందిన రంగనాయకులు అనే మరో కౌన్సిలర్ పులివెందులలో టిడిపి కార్యాలయంలో బీటెక్ రవి సమక్షంలో తెదేపాలో చేరారు. రంగనాయకులుకు బి.టెకరవి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పులివెందుల లో వైసిపి నుంచి వలస పర్వం పరం కొనసాగుతోందని, మరి కొన్ని రోజుల్లో ఎంతోమంది చేరబోతున్నారని, ముఖ్యంగా వీరందరూ పార్టీలోకి చేరేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న పరిపాలన, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన మాటకు కట్టుబడి చేస్తున్న రాష్ట్ర అభివృద్ధి పనితీరు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలకు చేస్తున్న మంచిని చూస్తూ మేము కూడా ఈ పార్టీలోకి చేరితే ప్రజలకు మంచి చేయవచ్చన్న ఉద్దేశంతో ఇక్కడ వైసీపీలో ఉన్న కౌన్సిలర్లు ఇద్దరు మా పార్టీలోకి చేరారని తెలిపారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు కూడా కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అనంతరం రంగనాయకులను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు సిద్ధారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు అన్నా రెడ్డి ప్రసాద్ రెడ్డి, తెదేపా సీనియర్ నాయకులు నల్లగారి భాస్కర్ రెడ్డి,మాజీ పట్టణ అధ్యక్షుడు మా భాష, తదితర తెదేపా నాయకులు ఉన్నారు.



# అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు, నేరేడు చెట్లు

**లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 12 ప్రభాత వార్త**
మండల పరిధిలోని అనంతపురం గ్రామపంచాయతీ యనమల వాండ్ల పల్లెలో యనమల విశ్వనాథ్ పొలం దగ్గర కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పొలాలగట్లకు నిప్పంటించడంతో మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు, నేరేడు చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని రైతు యనమల విశ్వనాథ్ లబోదిబోమన్నారు. ఇటువంటి సంఘటనలు చేసే రైతులకు కన్నీటిని మిగులుస్తున్న వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆయన వాపోయారు. దాదాపుగా 10 మామిడి చెట్లు, ఆరు కొబ్బరి చెట్లు, ఐదు నేరేడు చెట్లు పూర్తిగా అగ్నికి ఆహుతై సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కన్నీరు మున్నీరయ్యారు.


మంటలో పూర్తగా దగ్ధమైన చెట్లు

# గంగమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలన


ఈవో శ్రీనివాసులతో మాట్లాడుతున్న మదన్ మోహన్

**లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అనంతపురం గ్రామపంచాయతీలో వెలసిన గంగమ్మ తల్లి జాతర మార్చి1, 2 తేదీల్లో అత్యంత వైభవంగా జరుగుతుంది. గంగమ్మ జాతరకి రాయలసీమలోని నాలుగు జిల్లాలు నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కిన మొక్కలు చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకుంటారని కావున భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో శ్రీనివాసులుకు టీడీపీ మండల ఇంచార్జ్ యనమల మదన్ మోహన్ తెలిపారు. త్రాగునీరు, క్యూలైన్లలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, జాతరకు వచ్చే భక్తులకు చలువ పందిళ్ళు, స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే జాతర ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని గంగమ్మ గుడికి మరమ్మతులతో పాటు అమ్మవారి ఆలయానికి రంగులు కూడా వేయడం జరుగుతుందన్నారు. జాతర ప్రారంభమైయ్యే సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అంగరంగ వైభవంగా జాతర జరిగేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్. టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం రామచంద్ర, మురికినాటి రమణ, కావలి ఆంజనేయులు, సునీల్ యాదవ్, బోసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శివలింగం ప్రతిష్ఠామహోత్సవం

**వాల్మీకిపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**
పట్టణంలోని ఓంశాంతి జ్ఞానబోధన మందిరంలో మాఘమాసంను పురస్కరించుకుని బుధవారం మాఘ పౌర్ణమి రోజున శివలింగం, నంది విగ్రహాలను వేదపండితుల మంత్రాల మధ్య ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఓంశాంతి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు అనంతరం డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఓంశాంతి భవనంలో నిత్యం యోగా, ధ్యానం తదితర క్లాసులు నిర్వహణతో పాటు ఆధ్యాత్మిక బోధనలు ఉంటాయని యువత సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు ఈ కార్యక్రమంలో భక్తులు, వృద్ధులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు

# చెన్నై కంపెనీతో మిట్స్ ఎంఓయు



అవగాహన ఒప్పందాలు చేసుకొన్న దృశ్యం

**కురబలకోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నై కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. చెన్నైలోనే ఇన్స్‌పెయిర్ సాఫ్టెక్ సెల్యూషన్ మరియు ధారాహెచ్ఆర్ సెల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ కన్సలటింగ్ కంపెనీతో ఈ ఒప్పందం కుదుర్చుకొన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కంపెనీ సిఈఓ డాక్టర్ కార్తికేయభాను మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా ఇంజనీరింగ్, ఎంబిఏ, ఎంసిఏ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, అకడమిక్ ప్రాజెక్టులు, ప్లేస్‌మెంటు ట్రైనింగ్, ప్లేస్‌మెంటు ఆఫర్లలో అవకాశాలను అందించడం, విద్యా, వృత్తిపరమైన విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదుర్చుకొన్నట్లు తెలిపారు. ఈ ఒప్పంద పత్రాలపై ఆ సంస్థల పౌండర్ అండ్ సిఈఓ డాక్టర్ కార్మికేయభాను మేనేజింగ్ డైరెక్టర్ సి.ఎ.ఆనంద్, ఎంబిఏ విభాగాదిపతి డాక్టర్ గీతాదేవిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రిబుల్ఐ సిసెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ జైశ్వాల్, శ్రీకాంత్ ఈవెంట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మిట్స్‌కు త్రిబుల్ఏ రేటింగ్

**కురబలకోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
మదనపల్లె మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో టాప్ 20కళాశాలగా త్రిబుల్ఏ రేటింగ్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్‌పిటిఈఎల్ ఆన్‌లైన్‌లో జులై నుంచి డిసెంబర్ 2024వరకు సస్సెన్స్‌లో నిర్వహించిన పరీక్షల్లో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 7480 సర్టిఫికెట్ కోర్సులకు హాజరకుగానూ 5734మంది ప్రతిభ కనపరచడంతో జాతీయ స్థాయిలో ఎన్‌పిటిఈఎల్ సర్టిపికెట్లు పొందడమే కాకుండా 90మందికి గోల్డు రేటింగ్, 1024మందికి సిల్వర్, ఎల్టెట్ 2765మందికి లభించిందని ఆయన తెలిపారు. కళాశాలకు త్రిబుల్ఏ రేటింగ్‌తో పాటు టాప్ 20లో మిట్స్ కళాశాలకు 12వ ర్యాంకు గుర్తింపు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ గుర్తింపుకు కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులకు కళాశాల కరస్పాండెట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళ కృతజ్ఞతలు తెలిపారు.



త్రిబుల్ఏ రేటింగ్ అందుకొంటున్న దృశ్యం

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్



**చిన్నమండెం ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటల ఉత్పత్తులను మోడల్ మండల్ టీం లీడ్ చందు రెడ్డి, మండల్ ఇన్చార్జి శ్రీనివాసులు, ఏంటి పద్మావతి ఆధ్వర్యంలో చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బుదవారం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ తాజా కూరగాయలు ఆకుకూరలు, పసువు, కొర్రలు, మిర్చి పొడి చాలా నాణ్యంగా మంచి ప్యాకింగ్ చేసి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేశారు అని చెప్పారు. ప్రతి మండల కేంద్రాల్లో మరియు ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేస్తూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందిస్తూ మంచి పౌష్టికర ఆహార ఉత్పత్తులను అందించే కార్యక్రమం డిపిఎం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్నట్టు జూపిఈ పవన్ తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాంకుల పంట




**మైదుకూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
యూనివర్సిటీ స్థాయిలో మైదుకూరు డిగ్రీ కళాశాల విద్యార్థులు అభూతపూర్వమైన ప్రతిభ కనబరచి యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి మరియు అధ్యాపకులు విద్యార్థుల ర్యాంకుల ఘనతపై హర్షం వ్యక్తం చేశారు.యూనివర్సిటీ టాపర్స్ ఎస్. స్వరూప (బి.ఎస్సీ. బిజడ్ సి – వి సెమిస్టర్) – 9.74 యూనివర్సిటీ మొదటి ర్యాంకు,యామిని (బి.ఎ.–I సెమిస్టర్) – 9.5 యూనివర్సిటీ మొదటి ర్యాంకు, ఉత్తీర్ణత శాతం సాధించిన గ్రూపులు బి.ఎస్సీ. బిజడ్ సి (III సంవత్సరం), బి.కామ్. (II సంవత్సరం), బి.ఎస్సీ. కంప్యూటర్ సైన్స్ (I సంవత్సరం), బి.ఎస్సీ.జువాలజీ (I సంవత్సరం) 100 ఉత్తీర్ణత సాధించారు.

**ఇతర ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు:**
వీరభద్ర (II బి.కామ్) – 9.05,జె. కవిత (III బి.ఎ) – 9.02,సుజాత (I బి.ఎస్సీ. కంప్యూటర్ సైన్స్) – 9.0,బేబి (II బి.ఎస్సీ.బాట్నీ) – 8.95, వసంత్ (III బి.ఎస్సీ.యంపిసిఎస్ ) – 8.8,సౌభాగ్య లక్ష్మి (II బి.ఎస్సీ. కంప్యూటర్ సైన్స్) – 8.65,సాత్విక (I బి.ఎస్సీ.బాట్నీ) – 8.5,వినీల (I బి.ఎస్సీ.జువాలజీ) – 8.5,సాధికా బాను (I బి. కామ్) – 8.5,సాధించిన పాయింట్లుకు మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సుదీర్ఘ శ్రమకు, అధ్యాపకుల అంకితభావానికి ఫలితంగా ఈ ఘనత సాధ్యమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, మరియు అధ్యాపకులను హృదయపూర్వకంగా అభినందించారు.

## ఆశ్రమంలో మంచినీటి బోరు మోటార్

**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
గట్టుపల్లి చారిటబుల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గాంధీనగర్ తెలుగు గంగా కాలనీలో ఉన్న ఆనంద నిలయం నిరాశ్రయుల ఆశ్రయానికి ఒక బోరు మోటర్ వేయించిన దాతలు, సంస్థ చైర్మన్ అయినటువంటి గట్టుపల్లి కొండారెడ్డి యూఎస్ఏ వారి ఆధ్వర్యంలో వారి సంస్థ సభ్యులందరూ కలిసి బోరును ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, బద్వేల్ అర్బన్ సీఐ రాజగోపాల్ హాజరై ఆశ్రయములో నిర్వహిస్తున్నటువంటి వసతులు అన్నింటిని పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలోని అనేక కారణాలతో బాధలతో, నిరాశ్రయుల వసతి గృహం చేరినటువంటి వృద్ధులను చేరదీయడం. ఒక మంచి అభినందించదగ్గ విషయం అన్నారు. గట్టుపల్లి చారిటబుల్ ఫౌండేషన్ వారు ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహానికి లక్ష రూపాయలు ఖర్చు చేసి వసతి గృహానికి అవసరమైనటువంటి మంచినీటి సరఫరా కోసం, ఒక బోర్ మోటర్‌ను వేయించి ప్రారంభించడం ఒక మంచి శుభ సూచికంగా వారిని అభినందించారు. అదేవిధంగా సహాయం చేసినటువంటి దాతలకు, ఆశ్రయం నిర్వాహకులైన పిడతల రవికుమార్ ఆధ్వర్యంలో, చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి బద్వేల్ అర్బన్ సీఐ శ్రీ యం రాజగోపాల్ గారి చేతుల మీదుగా దాతలకు చిరు సన్మానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గట్టుపల్లి చారిటబుల్ ఫౌండేషన్ సెక్రెటరీ గీతాల పెంచల్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గీతాల వెంకటరత్నం రెడ్డి, కత్తెరపల్లి నాగార్జున రెడ్డి, మరియు రమణారెడ్డి, రవికుమార్ రెడ్డి, గీతల రామాంజనేయులు రెడ్డి, తిరువెంగళాపురం మాజీ సర్పంచ్ రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వాకమళ్ళ తులశమ్మ సేవలు మరువలేనివి




**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి తల్లి వాకమళ్ల తులసమ్మ వైకుంత సమారాధన కార్యక్రమం బద్వేల్ మున్సిపాలిటీ పరిధి పంగావాండ్లపల్లెలో నిర్వహించారు, ఈ కార్యక్రమములో ఎమ్మెల్సీ డీ.సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా తోపాటు పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు వాకమళ్ల తులసమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, ఎమ్మెల్సీ డీ.సీ గోవిందరెడ్డి,ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ వాకమల్ల తులసమ్మ మంచితనానికి మారుపేరుగా ఉంటూ పంగా వాళ్ళ పల్లె గ్రామంలోనే కాకుండా బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో కూడా అందరితో మంచితనంగా ఉంటూ అందరిని చిరునవ్వుతో పలకరిస్తూ అటు బంధు వర్గంలో కానీ గ్రామస్తులతో కానీ కలిసి మెలిసి ఉంటూ అందరి ఆదరభిమానాలు పొందిన వారన్నారు,ఆమె అకాల మరణం చాలా బాధాకరమన్నారు, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని సన్నిధికి చేరుకోవాలని పలువురు ఆకాంక్షించారు, అనంతరం మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి ప్రముఖ కాంట్రాక్టర్ వాకమళ్ల నారాయణరెడ్డి (బాబు) వారి కుటుంబ సభ్యులు వారి తల్లి వైకుంత సమారాధన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు, కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, నియోజకవర్గం బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మునెయ్య,మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ న్నాగ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు గానుగపెంట రమేష్ బాబు, కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ శేఖర్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాములు, మాజీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కేశవరెడ్డి, పుత్త శ్రీరాములు, మునయ్యా, నాగ సుబ్బారెడ్డి, ప్రభాకర్ రెడ్డి,పంగ చెన్న కృష్ణారెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ తమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి పార్టీ పలు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొని పలువురు తులసమ్మ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు,

## ఫార్మసీ విద్యార్థినికి ప్రధమ బహుమతి

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**
నేషనల్ లెవెల్ స్టూడెంట్స్ మీట్లో స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో నాలుగో సంవత్సరం బి ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న ఎం.సుగుణ ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఒంగోలులో క్విస్ విద్యా సంస్థలు నిర్వహించిన ఆటల పోటీల్లో లాంగ్ జంప్‌లో మొదటి బహుమతిని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. స్వర్ణలత తెలిపారు. ఈ మొదటి బహుమతిలో భాగంగా క్రిస్ విద్యాసంస్థలవారు నగదు బహుమతి, మెడల్ తో సర్టిఫికెట్ను అందజేశారు.ఈ మొదటి బహుమతి సాధించిన విద్యార్థిని కళాశాల వైస్ చైర్మన్ సి ఎల్లారెడ్డి అభినందిస్తూ కళాశాల స్పోర్ట్స్ ఇన్చార్జి ఎం .మధు అసోసియేట్ ప్రొఫెసర్ ప్రోత్సాహాన్ని కూడా ప్రశంసించారు.



## లలితా దేవికి కుంకుమార్చన

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మాఘమాస పౌర్ణమి సందర్భంగా బుధవారం స్థానిక పాత మార్కెట్ లోని లలితాదేవి రతనాల వెంకటేశ్వర స్వామి (అన్నా చెల్లెలు) ఆలయంలో లలితా దేవికి కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాత:కాలం నుండే ఆలయ మూలవిరాట్టులకు ప్రత్యేక గోక్షీర, పంచామృత అభిషేకాలు, విశేష పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు. సాయంత్రం లలితాదేవి ఉత్సవ మూర్తి వద్ద మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు భాగస్వామ్యం అవ్వగా ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి



**రాయచోటి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**
శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని డిఆర్ఓ ఛాంబర్‌లో ఈనెల 23 నుండి మార్చి 5 వరకు జరగబోయే శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన, జిల్లా దేవాదాయ శాఖ పోలీస్ అధికారులు రెవెన్యూ అగ్నిమాపక వైద్య ఆరోగ్యశాఖ విద్యుత్ శాఖ మున్సిపల్ కమిషనర్ ప్రజా రవాణా శాఖ రహదారులు మరియు భవనాల శాఖ ఎక్సైజ్ శాఖ విద్యాశాఖ తదితర అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు తలమానికమైన శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు ఉచిత దర్శనం, వసతి గదుల ఏర్పాటు, అన్నదానము,త్రాగునీటి కల్పన, తదితర అంశాలలో ఆలయ ఈవో, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, వీరభద్ర స్వామి ఆలయ ఈవో రమణారెడ్డి జిల్లా, మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తాసిల్దార్ పుల్లారెడ్డి, విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణా శాఖ, రహదారులు మరియు భవనాల శాఖ, ఎక్సైజ్ శాఖ, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ, శాఖల అధికారులు పాల్గొన్నారు.




అన్నమయ్య జిల్లా
బి.కొత్తకోట,
పి.టిఎం.,
వీరవల్లి.

కడప జిల్లా
కలసపాడు,
YVU,
పోరుమామిళ్ల,
ప్రొద్దుటూరు క్రైమ్,
కడప కలెక్టరేట్

మీ పూర్తి బయోడేటాతో
15వ తేదీ శనివారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086